# ప్రజా సమస్యలే ఎజెండాగా పనిచేస్తాం

- రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలిచేలా కృషి
- కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టుపై సంబంధిత మంత్రులతో చర్చిస్తా..
- ఎంపీ ఎన్నికల్లో ఆదరణ చూపినందుకు జిల్లా ప్రజలకు ధన్యవాదాలు
- తాండ్ర వినోద్ రావు



**కొత్తగూడెం, జూన్22(కెరటం ప్రతినిధి)**

ప్రజా సమస్యలే ఎజెండాగా పనిచేస్తామని, రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలిచేలా నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ కృషి చేస్తామని, కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టుపై సంబంధిత మంత్రులతో చర్చిస్తానని, ఎంపీ ఎన్నికల్లో ఆదరణ చూపినందుకు జిల్లా ప్రజలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు బిజెపి పార్టీ గుర్తుపై ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన తాండ్ర వినోద్ రావ్ ధన్యవాదాలు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్ ఆధ్వర్యంలో పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు బిజెపి పార్టీ గుర్తుపై ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన తాండ్ర వినోద్ రావ్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని ప్రజలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎంతో ఆదరణ చూపినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని, ప్రజా సమస్యల ఎజెండాగా పనిచేయాలని నిర్ణయించామని పెండింగ్ లో ఉన్న భద్రాద్రి కొత్తగూడెంలోని ఎయిర్పోర్టుపై సంబంధిత మంత్రులతో చర్చించటం జరిగిందని ఉమ్మడి జిల్లా అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని నిర్ణయించామని మారుమూల గ్రామాలలో కూడా మమ్మల్ని ఆదరించినందుకు ఎంతో ఆనందంగా ఉందని ఏ పార్టీకైనా ప్రజా తీర్పే ముఖ్యమని రాబోయే జెడ్పిటిసి ఎంపీటీసీ పంచాయతీ ఎన్నికల్లో పార్టీలోని అందరు కార్యకర్తల నాయకుల సహకారంతో ఎక్కువ స్థానాలు గెలిచేలా పార్టీ బలోపేతం అయ్యేలా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు గొడుగు శ్రీధర్, చుంచుపల్లి మండల అధ్యక్షుడు రాయుడు నాగేశ్వరరావు, గాంధీ పలు జిల్లా మండల నాయకులు కార్యకర్తలు బిజెపి అభిమానులు పాల్గొన్నారు.



# విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి

- సింగరేణి విద్యా సంస్థల్లో 100 శాతం ఫలితాలు సాధించాలి
- త్వరలో సీబీఎస్ఈ పాఠశాలగా సెక్టర్-3 స్కూల్
- ఖర్చుకు వెనకాడకుండా పాఠశాలల ఆధునికీకరణ
- సింగరేణి విద్యా సంస్థల పనితీరుపై సమీక్షలో సీఎండీ ఎన్.బలరామ్



**సింగరేణి భవన్, జూన్22(కెరటం ప్రతినిధి)**

సింగరేణి విద్యా సంస్థలను అత్యుత్తమ విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సింగరేణి చరిత్రలో తొలిసారిగా రామగుండం-2 ఏరియాలోని సెక్టర్-3 పాఠశాలలో సీబీఎస్ఈ బోధనను త్వరలోనే ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఇప్పటికే చర్యలు తీసుకోవడం జరిగిందని.. అలాగే సింగరేణి ఆధ్వర్యం లో నడుస్తున్న 9 పాఠశాలలు, 1 జూనియర్ కళాశాల, 1 డిగ్రీ కాలేజీ, 1 పీజీ కాలేజ్, పాలిటెక్నిక్ కళాశాలల పనితీరుపై తొలిసారిగా శనివారం సాయంత్రం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని పాఠశాలల్లో గత ఏడాది సాధించిన 10వ తరగతి ఫలితాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించిన సెక్టర్-3 పాఠశాల, భూపాల పల్లి పాఠశాలల యాజమాన్యాలను అభినందించారు. మిగిలిన పాఠశాలలు కూడా విద్యార్థుల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ, చొరవ తీసుకోవాలని సంబంధిత పాఠశాలల ప్రిన్సిపళ్లను ఆదేశించారు. సింగరేణి విద్యా సంస్థల్లో దాదాపు 7500 మంది విద్యను అభ్యసిస్తున్నారని.. గత ఏడాది 94 శాతం ఫలితాలు సాధించినట్లు జీఎం(ఎడ్యుకేషన్) నికోలస్ వివరించారు. సింగరేణి విద్యా సంస్థలను దేశంలోనే ప్రతిష్టాత్మక విద్యా సంస్థలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, ప్రిన్సిపళ్లు, కరస్పాండెట్లపై ఎక్కువగా ఉందని.. అందరూ సమన్వయంతో పనిచేయాలని సీఎండీ పిలుపునిచ్చారు. పాఠశాలల్లో అహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలని.. ఖర్చుకు వెనకాడకుండా పాఠశాలల ఆధునికీకరణకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పవిత్రమైన విద్యా సంస్థల్లో పనిచేస్తున్న వాళ్లు మరింత అంకిత భావంతో పనిచేయాలని.. విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని , క్రీడాసక్తిని కూడా పెంపొందించేలా బోధన సాగాలన్నారు. సింగరేణి విద్యా సంస్థల్లో ఇతరులను జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని.. సమస్యలు ఉంటే యాజమాన్యం దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా సింగరేణి డైరెక్టర్(పర్సనల్, ఆపరేషన్స్) ఎన్.వి.కె.శ్రీనివాస్, జీఎం(కో ఆర్డినేషన్) జి.దేవేందర్, జీఎం(ఎడ్యుకేషన్) నికోలస్, అన్ని పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపళ్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## కలెక్టర్‌ను కలిసిన కాంట్రాక్ట్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

**కొత్తగూడెం, జూన్22(కెరటం ప్రతినిధి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కలెక్టర్‌గా జితేష్ వి పాటిల్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్ట్ ఉపాధ్యాయ సంఘం తరపున మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్, రాష్ట్ర నాయకులు రూప్లా, రవి, జిల్లా నాయకులు పాడియా వెంకటేశ్వర్లు, వెంకట్ కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.



## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

**కాంగ్రెస్ పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు**



**కొత్తగూడెం, జూన్22(కెరటం ప్రతినిధి)**

రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని, రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం అని కాంగ్రెస్ పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూ కల రంగారావు అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా వరంగల్లో ప్రకటించిన రైతు డిక్లరేషన్ ప్రకారం రైతు రుణమాఫీకి రేవంత్ సర్కార్ శ్రీకారం చుట్టిందన్నారు. తెలంగాణలను రైతులందరికీ ఒకే దఫా రెండు లక్షల రూపాయల రుణమాఫీకి ఆమోదం తెలపడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేసారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 400 కే గ్యాస్, రైతు రుణమాఫీ, 200 యూనిట్లు వచ్చిన కరెంటు వంటి ప్రజా కర్షగా పథకాలతో ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం దేశ దృష్టిని ఆకర్షించింది అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ భవిష్యత్తును బంగారమయం చేసేందుకు, రేవంత్ సర్కార్ సుదీర్ఘ ప్రణాళికలు రచిస్తుందన్నారు.

## రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

**కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా నాయకులు దేవీలాల్ నాయక్**



**కొత్తగూడెం, జూన్22(కెరటం ప్రతినిధి)**

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో భాగంగా వరంగల్ రైతు డిక్లరేషన్లో రెండు లక్షలు రుణమాఫీ చేస్తామని ఆనాడు మాట ఇచ్చిన ప్రకారం సుమారు 48 లక్షల మంది రైతులకు సుమారు 31 వేల కోట్లు బడ్జెట్ తో రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా నాయకులు దేవీలాల్ నాయక్ తెలిపారు. రైతులకు మద్దతు ధర కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సాధ్యమని చెప్పినట్టుగా రైతులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలయేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు ప్రజల సంక్షేమాన్ని కోరుకుంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర్ రావుకి, మంత్రివర్గానికి కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా నాయకులు దేవీలాల్ నాయక్ కృతజ్ఞతలు తెలియజేశారు.